సంపూర్ణ పోషణ కిట్‌లతో ఆరోగ్యం



పోడూరు: నల్లవెంకయ్యచెరువులో సంపూర్ణ పోషణ కిట్‌లు అందజేస్తున్న ఎంపీపీ సబ్బితి సుమంగళి



పోడూరు: పెనుమదంలో సంపూర్ణ పోషణ కిట్‌లు అందజేస్తున్న సొసైటీ చైర్మన్ కొర్రపాటి వీరాస్వామి



పాలకొల్లు అర్బన్: పూలపల్లిలో పౌష్టికాహారం అందజేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పులఖండం సత్యవేణి

పోడూరు: వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లతో గర్భిణీలకు, పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యవంతంగా ఉంటారని ఉంపీపీ సబ్బితి సుమంగళి అన్నారు. కవిటం శివారు నల్లవెంకయ్యచెరువు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఆమె ముఖ్యఅతిథిగా హాజరై గర్భిణులకు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మాతృశిశు మరణాలను తగ్గించడంతో పాటు తల్లీబిడ్డల సంపూర్ణ ఆరోగ్యం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మెండైన పోషక విలువలున్న ఆహారంతో వైఎస్సార్ పోషణ కిట్‌లను గర్భిణీలకు, బాలింతలకు పంపిణీ చేస్తున్నారన్నారు.

పెనుమదంలో..

పెనుమదంలో మంగళవారం సొసైటీ ఛైర్మన్ కొర్రపాటి వీరాస్వామి ముఖ్యఅతిథిగా హాజరై గర్భిణీలకు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను అందజేశారు. సర్పంచ్ తానేటి బాబూరావు, ఎంపీటీసీ సభ్యుడు చుట్టుగుల్ల ఆంజనేయులు, గ్రామకమిటీ అధ్యక్షులు గెద్దాడ వెంకటరమణ(ఏసు), సచివాలయ కన్వీనర్లు అడబాల సత్తిబాబు, కొల్లు వెంకట్రావు, బీరా రాజశేఖర్ పాల్గొన్నారు.

గుమ్మలూరులో...

గుమ్మలూరు శివారు పైడావ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం సర్పంచ్ గొట్టుముక్కల సోనియా చేతులమీదుగా గర్భిణీలకు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు అంబటి సుధాకర్, ఉపసర్పంచ్ అల్లూరి గీతావాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు నేలపూడి సురేష్, బొందా రాజేష్ పాల్గొన్నారు.

పండితవిల్లూరులో...

పండితవిల్లూరు మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం సర్పంచ్ ఇళ్ల లక్ష్మీచంద్రిక చేతులమీదుగా గర్భిణులకు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఇందుకూరి సూర్యకాంతం, ఉపసర్పంచ్ సదమల్ల వెంకటేష్, ఎన్జీఓ డైరెక్టర్ గెద్దం సామ్యూల్ జాన్సన్ పాల్గొన్నారు.

తల్లి పాలతో సంపూర్ణ ఆరోగ్యం

పెనుగొండ: శిశువులకు తల్లిపాలుతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అయోధ్యలంక గ్రామ సర్పంచ్ కడలి కృష్ణవేణి వెంకట రెడ్డి అన్నారు. మంగళవారం అయోధ్యలంకలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని గర్భిణులకు, బాలింతలకు వైఎస్సార్ పోషకాహార కిట్లును పంపిణీ చేశారు. రెండేళ్లువరకూ వైద్యులు సూచించిన ప్రకారం పిల్లలకు తల్లిపాలు తప్పని సరిగా అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కంచుస్తంభం శ్రీను, పార్టీ నాయకులు గొల్లపల్లి బాలకృష్ణ, ఎం సత్యనారాయణ, కడలి వెంకట రెడ్డి, ఎం సూరిబాబు, రొక్కాల వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీ కార్యకర్త బి.అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లులో...

పాలకొల్లు అర్బన్: బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం వలన రక్తహీనత సమస్యల నుంచి పూర్తిగా ఉపసమనం పొందుతారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పులఖండం సత్యవేణి అన్నారు. మండలంలోని పూలపల్లిలో మంగళవారం గర్భిణులు, బాలింతలకు డా. వైఎస్సార్ సంపూర్ణ పోషణలో భాగంగా రూ.1100 విలువైన కిట్లను అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు దొమ్మేటి శ్రీనివాస రావు, దొమ్మేటి లోకేష్, కోళ్ల వెంకట్, కడలి ఆంజనేయులు, ఉనికిలి శ్రీనివాసారావు, గంటా వెంకన్న, అంగన్‌వాడీ టీచర్లు అడబాల కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాలకొల్లు అర్బన్: మండలంలోని పూలపల్లి 33/11కేవీ లో 11కేవీ ఇండస్ట్రియల్ ఏరియా, 11కేవీ శివదేవునిచిక్కాల ఫీడర్‌ల పరిధిలోని గ్రామాల్లోబుధవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.సురేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భగ్గేశ్వరం, చింతపర్రు, చందపర్రు, సత్యనారాయణపురం, ఆగర్రు, చిట్టివానిగరువు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

హెచ్ఐవీ బాధిత చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ



హెచ్ఐవీ బాధిత చిన్నారులకు పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో హెచ్ఐవీతో బాధపడుతున్న చిన్నారులకు మంగళవారం పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ హెచ్ఐవీ రోగ పీడితులు పౌష్టికాహారం తీసుకుని, క్రమం తప్పకుండా మందులు వాడితే జీవిత కాలం జీవించవచ్చన్నారు. అలాగే రోగ పీడితులను సమాజంలో ప్రతీ ఒక్కరూ ఆదరించాలన్నారు. వారిని సమాజం నుంచి వెలివేయడం తదితర చర్యలకు పాల్పడితే శిక్షార్హులవుతారన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ బోర్డు కన్వీనర్ ముత్యాల రామావు, ఉపాధ్యక్షుడు ధనాని సూర్యప్రకాష్, సభ్యులు తమ్మినీడి మురళీకృష్ణ, విన్నకోట వెంకటరమణ, ముత్యాల శ్రీవాత్సవ ప్రదీప్, శిద్దాని బాలశంకర మల్లేశ్వరరావు, పాజిటివ్ పీపుల్ సొసైటీ మెంబర్ శేషారాజ్యం తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో సమస్యలు పరిష్కరించాలి

పెనుమంట్ర: రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు టీహెచ్ఆర్ అమలుకు కొత్తగా తీసుకువచ్చిన ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో వస్తున్న సమస్యలు పరిష్కరించాలని లేకపోతే యాప్‌ను రద్దు చేయాలని మంగళవారం పలువురు అంగన్‌వాడీ ఉద్యోగులు పెనుమంట్ర ఐసీడీఎస్ ప్రాజెక్టు వద్ద వినతిపత్రం అందజేసారు. ప్రభుత్వం ఇచ్చిన ఫోన్‌లు పని చేయకపోతే యాప్‌లు రద్దుచేయాలని గ్రామాలలో నెట్ సిగ్నల్స్ లేక ఎఫ్ఆర్ఎస్ అమలు చేయలేక అంగన్‌వాడీ సిబ్బంది మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, ప్రాజెక్టు పరిధిలోని సంఘ నాయకురాలు కె.తులసి అన్నారు. ఈసందర్భంగా సిబ్బంది ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని సీడీపీఓకి అందజేశారు.

వైఎన్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు



ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో అధ్యాపకులు

నరసాపురం రూరల్: నరసాపురంలోని శ్రీ వైఎన్ కళాశాల హెచ్ఆర్‌డీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 25 మంది ఎంపికైనట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. టెక్ మహీంద్రా కంపెనీ వారితో నేషనల్ కెరీర్ సర్వీసెస్ వారి సౌజన్యంతో ఈ ప్రాంగణ ఎంపికలు నిర్వహించామని కళాశాల ప్రిన్సిపాల్ అప్పారావు పేర్కొన్నారు. టెక్ మహీంద్ర కంపెనీలో కస్టమర్ సపోర్టు ఉద్యోగాలకు జరిపిన ఈ ఇంటర్వ్యూల్లో పాల్గొనేందుకు శ్రీ వైఎన్ కళాశాల విద్యార్థులతోపాటు శ్రీసూర్య, చాంబర్స్, ఆదిత్య కళాశాలలు, స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన 91 మంది విద్యార్థులు హాజరవ్వగా వీరిలో 25 మంది ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు కంపెనీలో ఫైనల్ రౌండ్ ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. ఎంపికైన విద్యార్థులు చెన్నై ఆఫీస్‌లో పని చేయాల్సి ఉంటుందని కంపెనీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల కార్యదర్శి డాక్టర్ చినమిల్లి సత్యనారాయణరావు అభినందించారు. ఈ ఎంపికల్లో టెక్ మహీంద్ర కంపెనీ హెచ్ఆర్ మేనేజర్ శివ, నేషనల్ కెరీర్ సర్వీసెస్ ప్రతినిధి కిషోర్ రెడ్డి పర్యవేక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ కనకారావు, డీన్ డాక్టర్ గంధం రామకృష్ణ, డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్, సిహెచ్ రవికుమార్, శ్రీసారంగపాణి, మారుతీరావు తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ నిర్మూలనపై అవగాహన

సాక్షి, భీమవరం: విద్యాసంస్థల్లో విద్యార్థులను ర్యాగింగ్ చేస్తే పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయని న్యాయవాదులు ఎ.రాజేష్, సి.జ్వాలాశ్రీనివాస్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక డీఎన్నార్ ఇంజినీరింగ్ కళాశాలలో భీమవరం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ర్యాగింగ్ నిర్మూలనపై ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. విద్యాసంస్థల ఆవరణలో యాంటీ ర్యాగింగ్ కమిటీ, ర్యాగింగ్ చేస్తే కలిగే దుష్పరిణామాలను పోస్టర్స్ రూపంలో ఏర్పాటుచేయాలని అన్నారు.

వైఎస్సార్ సీపీ కొంతేరు అధ్యక్షురాలిగా భాగ్యలక్ష్మి



భాగ్యలక్ష్మి

యలమంచిలి: వైఎస్సార్ సీపీ కొంతేరు గ్రామ కమిటీ అధ్యక్షురాలిగా ఆ గ్రామ మాజీ సర్పంచ్ జక్కంశెట్టి భాగ్యలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ మండల కన్వీనర్ పొత్తూరి బుచ్చిరాజు ఆధ్వర్యంలో మంగళవారం గ్రామంలో నిర్వహించారు. పార్టీ సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కొయ్యే నాగేశ్వరరావు, వీరా సత్యప్రసాద్ కార్యదర్శిగా పోలుకొండ వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శులుగా సదమల్ల బాలరాజు, కానుకొలను సర్వేశ్వరరావు, పిట్టా రాజేష్, జక్కంశెట్టి వెంకటరెడ్డి ప్రచార కమిటీ అధ్యక్షుడిగా నిమ్మకాయల వెంకట దుర్గాప్రసాద్ ఉప ప్రధాన కార్యదర్శులుగా తెన్నేటి అలగ్జాండర్, కడలి శ్రీనివాస్, రేజేటి సత్యనారాయణ, బందెల జార్జి కోశాధికారిగా జక్కంశెట్టి సుబ్రహ్మణ్యం తదితరులను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ అభినందనలు తెలిపారు.

ప్రముఖ కవి రామారావుకు నివాళి



రామారావు చిత్రపటం నివాళులర్పిస్తున్న రసధుని సాహితీ సంస్థ సభ్యులు

పాలకొల్లు అర్బన్: సాహితీ వనంలో సువాసనలు వెదజల్లిన పుష్పం కొట్టి రామారావు అని పలువురు వక్తలు అన్నారు. రసధుని సాహితీ సంస్థ ఆధ్వర్యంలో జూలై నెల 7న మృతి చెందిన ప్రముఖ కవి రామారావు సంతాప సభ పట్టణంలోని స్థానిక పెన్షనర్స్ భవనంలో రసధుని అధ్యక్షుడు కొట్టి భాస్కరరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. కొట్టి రామారావు పోడూరు మండలం వేడంగి గ్రామంలో జన్మించి మచిలీపట్నంలో స్థిరపడ్డారని వక్తలు గుర్తు చేసుకున్నారు. రామారావు చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రముఖ కవి మామిడిశెట్టి శ్రీనివాసరావు రామారావు రచనలను సభకు పరిచయం చేశారు. రసధుని మాజీ అధ్యక్షుడు వంగా నరసింహరావు, డా.కేఎస్‌పీఎస్ వర్మ, ప్రతాప్‌రాజు, యర్రంశెట్టి వెంకటరత్నం, కోలాటి చినపెద్దిరాజు, బీఎస్ఎస్ఎల్ రాజు, చేగొండి రంగారావు, సీహెచ్ వెంకటపతివర్మ, చలపతి తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు



వెలివెలలో సాగునీటి సమస్యపై రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్



బూరుగుపల్లిలో సిమెంట్ రోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: సాగునీటి ఇబ్బందులు లేకుండా తక్షణం అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. మండలంలోని జిన్నూరు ఛానెల్ వెలివెల ఆయకట్టులో సుమారు 700 ఎకరాలకు సాగునీరు అందక, దమ్ములు చేసుకోలేదని పలువురు రైతులు ఎమ్మెల్సీ శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లడంతో మంగళవారం ఆయన ఆ గ్రామాన్ని సందర్శించి రైతుల ఇబ్బందులు స్వయంగా తెలుసుకున్నారు. సాగునీరు అందక దమ్ములు చేసుకోలేదని, ఒక వైపు నారుమడులు ఎదిగి, వరినాట్లు పూర్తి కాలేదని రైతులు శ్రీనివాస్ దృష్టికి తీసుకు వెళ్లారు. ఇరిగేషన్ డీఈ, ఏఈలతో మాట్లాడి తక్షణం జిన్నూరు చానెల్‌లో నీటిమట్టం పెంచి రైతులకు సాగునీరు ఇబ్బందులు చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే మెరక రైతులకు ఆయిల్ ఇంజిన్లు ఏర్పాటు చేసి సాగునీరు తోడుకుని వరినాట్లు పూర్తి చేసుకునేవిధంగా రైతులకు సహకారం అందించాలన్నారు. పంట కాలువలో పేరుకుపోయిన చెత్త, తూడు తక్షణం తొలగించి సాగునీరు సక్రమంగా పారుదలకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట సర్పంచ్ కెల్లా సింహాచలం, వైసీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గూడూరి వెంకట నరసింహరావు, ఉపసర్పంచ్ కందుల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మన్నె కోటేశ్వరరావు, విత్తనాల నరసింహరావు, బండి రాంబాబు, రైతులు బోడపాటి పెదకాపు, గుమ్మాపు రవి, కడలి నాగేశ్వరరావు, కడలి పెద్దిరాజు, కవురు సాయిబాబా, సూరిబోయిన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

యలమంచిలి: కంచుస్తంభపాలెం, బూరుగుపల్లి గ్రామాలలో జరిగిన పలు అభివృద్ధి పనులను మంగళవారం ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ ప్రారంభించారు. కంచుస్తంభంపాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వ నిధులు రూ.8 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును, జిల్లా పరిషత్ సాధారణ నిధులు రూ.3.25 లక్షలతో వంతెన సైడ్‌వాల్ పనులను బూరుగుపల్లి పంచాయతీ మట్టవానిచెరువులో ఉపాధిహామీ నిధులు రూ.40 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. అనంతరం బూరుగుపల్లి జగనన్న కాలనీలో 56 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలో జరుగుతున్న మంచి పనులను ప్రజలు గుర్తించాలని కోరారు. మీకు, మీ కుటుంబ సభ్యులకు మంచి జరిగిందని భావిస్తే వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి జగనన్నను మరొకసారి ముఖ్యమంత్రిని చేయాలని శ్రీనివాస్ కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రావూరి వెంకటరమణ, రెండు గ్రామాల సర్పంచ్‌లు ఆకుల సూర్యనారాయణ, చెల్లింకుల లక్ష్మీ శ్రీనివాస్ వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ పరిశీలకుడు గుణ్ణం నాగబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిలువూరి కుమార దత్తాత్రేయవర్మ సర్పంచ్‌ల చాంబర్ మండల అధ్యక్షుడు వల్లభసాయి వెంకట నరసింహారావు జేసీఎస్ కన్వీనర్ ఓదూరి భాస్కరరావు ఎంపీటీసీ సభ్యురాలు కడలి సుబ్బలక్ష్మి, ఏడుకొండలు, పెంటపాటి నూకరాజు, యాతం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల అభివృద్ధికి కృషి



పెనుగొండ గురుకుల పాఠశాల అభివృద్ధిపై సమీక్షిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఉమాసోమేశ్వర స్వామి కమిటీ సభ్యులు

పెనుగొండ: పెనుగొండలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు తెలిపారు. సోమవారం తూర్పుపాలెంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్తేరు క్వీనీతో అభివృద్ధిపై సమీక్షించారు. పాఠశాలకు అవసరమైన స్థలం కేటాయించడానికి ప్రయత్నిస్తానని తెలిపారు. మండలంలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు. పేద వర్గాలకు విద్యను అందించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. వీటి ఫలితాలు విద్యార్థులకు అందేవిధంగా కృషి చేయాలన్నారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన కంప్యూటర్లు, ఇతర పరికరాలను సొంత ఖర్చులతో అందిస్తానని హామీ ఇచ్చారు. అవసరమైన వాటిని గుర్తించి తెలియ చేస్తే వాటిని సమకూరుస్తామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని కోరారు. కార్యక్రమంలో పోడూరు జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు, పార్టీ నాయకులు పెన్మెత్స విశ్వనాథరాజు, మేడిచర్ల పండు, గణేషుల సుబ్బారావు, కడలి వెంకట రెడ్డి, అడ్డాల గంగరాజు, కొప్పాడి సత్యనారాయణ, కోట వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

సహకారం అభినందనీయం

పెనుగొండ: స్థానిక లింగాల వీధిలోని ఉమాసోమేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి సహకారం అందించిన మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం తూర్పుపాలెంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజును కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తమనంపూడి అబ్బులురెడ్డి, తమనంపూడి రాంబాబు రెడ్డి, తమనంపూడి సుబ్రహ్మణ్యం రెడ్డి, నూలి పవన్ నాగేంద్రకుమార్, తమనంపూడి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ తీరుపై ఆగ్రహం



పెనుగొండ ఎంపీపీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస దొర

పెనుగొండ: విద్యుత్ శాఖ తీరుపై పెనుగొండ మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఎంపీపీ పూతినిడి వెంకటేశ్వరరావు(పెద్ద) అధ్యక్షతన మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ కోతలు లేకపోయినా పెనుగొండ మండలంలో విద్యుత్ సరఫరానిలిచిపోతుందంటూ విమర్శించారు. ప్రజా ప్రతినిధులకు సైతం విద్యుత్ శాఖాధికారులు స్పందించడం లేదన్నారు. దొంగరావిపాలెంలో విద్యుత్ స్తంభాలు మార్పునకు రూ.62 వేలు చెల్లించినా స్తంభాలు మార్చకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ములపర్రులో విద్యుత్ స్తంభాలు మార్పుల అంచనాలకు ఇదే పరిస్థితి నెలకొందంటూ విమర్శించారు. ఇప్పటికైనా స్పందించి సమస్యలు తీర్చాలంటూ డిమాండ్ చేశారు. సబ్ స్టేషన్‌లో ట్రాన్స్‌ఫాం కాలిపోవడం వల్ల విద్యుత్ సర ఫరకు అంతరాయం కలుగుతుందని, దీనికి తోడు విద్యుత్ సిబ్బంది సమ్మెతో మరమ్మతులు జరగడం ఆలస్యమవుతుందని త్వరలోనే సమస్యను పరిష్కరించడం జరుగుతుందని విద్యుత్ శాఖాధికారులు పేర్కొన్నారు.

అందుబాటులో ఎరువులు

సార్వా సాగుకు ఎరువుల కొరత లేదని, రైతు భరోసా కేంద్రంల్లోనూ, సొసైటీల్లోనూ ఎరువులు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయాధికారి పి స్పందన తెలిపారు. 125 టన్నుల ఎరువులు ఉన్నాయన్నారు. మండలంలో 6672 మందికి రైతు భరోసా అందించామని తెలిపారు. రైతులు అందరూ ఈ క్రాప్ తప్పని సరిగానమోదు చేసుకోవాలని దీనికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు.

కిసాన్ కార్డులుసద్వినియోగం చేసుకోవాలి

పాడి పశువులకు కిసాన్ కార్డులు జారీ చేయడం జరుగుతుందని, దీని ద్వారా ఒక్కో పాడి పశువుకు రూ.25వేలు రుణం అందిస్తున్నామని వైద్యాధికారి టి రామి రెడ్డి వివరించారు. అదేవిధంగా అత్యవసర పశువైద్యానికి పశు సంచార వాహనాలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, 1962కు సమాచారం అందిస్తే సత్వర సహాయం అందుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రూ.7.75 కోట్లు అమ్మ ఒడి

మండలంలో విద్యార్థుల తల్లుల ఖాతాల్లో అమ్మ ఒడి పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రూ.7.75 కోట్లు జమ చేయడం జరిగిందని విద్యాశాఖాధికారి టి.రామకృష్ణ తెలిపారు. ఎవరికైనా జమ కాకపోతే సచివాలయంలో సంప్రదిస్తే పరిష్కరిస్తారన్నారు. 4205 మంది విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన క్రింద పుస్తకాలు, యూనిఫాంలు, విద్యాకానుక అందించాన్నారు. అదేవిధంగా జగనన్న గోరుముద్దలో వినూత్న మార్పులతో మెనూ అమలు చేస్తూ పౌష్టికాహారం అందిస్తున్నట్లు వివరించారు. మండల పరిషత్ నిధులతో గతం కన్నా భిన్నంగా మండలాన్ని అభివద్ధి బాటలో తీసుకు వెళుతున్నట్లు ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పోడూరి గోవర్ధన, వైస్ ఎంపీపీలు పాలపర్తి సుబ్రహ్మణ్యం, తోలేటి శ్రీను, ఎంపీడీవో టి శ్రీనివాసదొర తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆజాదీకా అమృత్ మహోత్సవాలు

పెనుమంట్ర: కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు అనుసరించి పంచాయితీరాజ్ కమిషనర్ మరియు గ్రామీణ అభివృద్ధిశాఖ ఆదేశాల మేరకు ఈ నెల 9నుంచి 15 వరకు ప్రతీ గ్రామంలో ఆజాదీకా అమృత్ మహోత్సవాలు నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపీడీఓ వి.పూర్ణబాబ్జి తెలిపారు. నా భూమి–నాదేశం, నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం అనే సందేశం నినాదాలతో ఈ కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. 9న శిలాఫలకాలు ఆవిష్కరణ, 10న ప్రతిజ్ఞ, 11న వసుధకు వందనం, 14న వీరులకు వందనం, 15న శిలాఫలకాల ఆవిష్కరణ వద్ద నిర్మించిన స్తూపాలపై జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమం ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో ఏర్పాటు చేసి నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

హడావుడిగా శిలాఫలకాల నిర్మాణం



కోతులగుణం చెరువు వద్ద శిలాఫలకంపై ప్రధాని, సీఎం సందేశాలను రాస్తున్న పెయింటర్



జుత్తిగలో చెరువుగట్టుపై ఏర్పాటు చేసిన శిలాఫలకం

పెనుమంట్ర: మండలంలో బుధవారం నుంచి 15 వరకు నిర్వహించే ఆజాదీకా అమృత్ మహోత్సవాలు నిర్వహణకు ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఒక శిలాఫలకాన్ని నిర్మించి ఈ వారం రోజుల కార్యక్రమాలు అక్కడే నిర్వహించాలని జిల్లా కలెక్టర్‌నుంచి స్పష్టమైన ఆదేశాలు రావడంతో గ్రామాలలో అమృత్ సరోవర్ నిధులతో అభివృద్ధి చేపట్టిన చెరువుల వద్ద శిలాఫలకాలు నిర్మించి హడావిడిగా పెయింటింగ్స్ వేస్తున్నారు. దీంతో పెక్సీల ముద్రణకంటే చేతి పెయింటర్స్ డిమాండ్ ఏర్పడింది. కొన్ని పంచాయతీల్లో ఇంకా శిలాఫలకాలు నిర్మాణాలు ప్రారంభం కాకపోవడంతో మధ్యాహ్నం నుంచి శిలా ఫలకాలు నిర్మాణాలు ప్రారంభించారు. శిలాఫలకంపై నా భూమి నాదేశం, నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం అనేని నాదంతో పాటు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిల సందేశాలను కూడా ఆ శిలాఫలకాలపై పొందుపర్చి ఆ ప్రాంతాలలో స్వాతంత్ర్య సమరయోధుల పేర్లను ఆశిలాఫలకాలపై రాయాల్సి ఉంది. మంగళవారం సాయంత్రానికే సిద్ధం కావాల్సి ఉండగా, కొన్ని గ్రామాల్లో శిలాఫలకం నిర్మాణ పనులు కూడా ప్రారంభించలేదు. బుధవారం ఉదయమే ఈ శిలా ఫలకాలు ఆవిష్కరించాల్సి ఉంది.

సెప్టెంబర్ 9న జాతీయ లోక్‌అదాలత్

నరసాపురం రూరల్: రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా మండల న్యాయసేవాసంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబరు 9వ రాజీ కాదగిన సివిల్, క్రిమినల్ కేసులను రాజీ చేస్తారని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని 10వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవాసంస్థ ఛైర్మన్ పి.విజయదుర్గ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. జాతీయలోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకుంటే కలిగే ప్రయోజనాలను వివరిస్తూ కట్టిన కోర్టు ఫీజును వాపసు ఇస్తారన్నారు. ఇక్కడ రాజీ అంతిమ తీర్పు అని అప్పీలు చేసుకునే అవకాశం ఉండదన్నారు. కాబట్టి ఈ అవకాశాన్ని కక్షిదారులు ఉపయోగించుకుని తమ కేసులను రాబోయే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవాలని ఆమె కోరారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: సెప్టెంబర్ 9న పాలకొల్లు కోర్టు ఆవరణలో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులు ఎక్కువ మంది పాల్గొని కేసులు పరిష్కరించుకులా పోలీసులు, ఇతర అధికారులు కృషి చేయాలని ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్ వరలక్ష్మి సూచించారు. పాలకొల్లు కోర్టు ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. పోలీసు అధికారులు తమ పరిధిలోని మండలాలకు చెందిన కక్షిదారులతో మాట్లాడి కుటుంబ తగాదాలు, చెక్ బౌన్స్ కేసులు, ఇతర కేసులు రాజీపడవచ్చన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల భారాన్ని తగ్గించడం కోసం కక్షిదారులకు ఈ వెసులబాటు కల్పిస్తున్నట్లు జడ్జి వరలక్ష్మి అన్నారు. ఏపీపీ జయసింధు, సర్కిల్ పరిధిలోని సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.